దెయ్యాలకే
దడపుట్టించిన
ఆ కొత్త దెయ్యం
ఎక్కడ్నుంచి వచ్చింది?

# కొత్తదయ్యం

వాసాల వెంకట్రాజ్ కథ

అర్ధరాత్రి పన్నెండు గంటల సమయము..

అమావాస్య కావడం వలన అడవి అంతా గాడాంధకారంలో మునిగి వుంది...

కళ్ళు పొడుచుకుని చూసినా ఏమీ కనిపించని కటిక చీకటి...

ఆ చీకటిలో, విసురుగా వీస్తున్న గాలికి పొడవైన చెట్లు ఇటూ ఆటూ ఊగుతూ మినుగురు పురుగుల వెలుతురులో 'జడల దెయ్యాలు'గా మసక మసకగా కనిపిస్తున్నాయి. ఆగి ఆగి అరుస్తూ వింత శబ్దాన్ని సృషిస్తున్నాయి కీచురాళ్ళు. అడవిలో దూరంగా పసిపిల్లలు గుక్కతిప్పుకోకుండా ఏడుస్తున్నట్లుగా అరుస్తున్నాయి నక్కలూ, తోడేళ్ళు...

ఆ దట్టమైన అడవిలో ఓ పురాతన గుహ వుంది. జంతువులు ఆ గుహలోకి వెళ్ళడానికి జంకుతాయి., 'తాము తిరిగి బయటికి రామేమో' నన్న భయంతో... కనీసం ఆ గుహ దరిదాపుల్లోకి వెళ్ళడానికూడా సాహసించవు. ఆ గుహ ప్రతీ అమావాస్య రాత్రి వింత వింత ధ్వనుల్తో ప్రతిధ్వనిస్తూ, కళ్ళు మిరుమిట్లుగొలిపే కాంతితో ప్రకాశిస్తూ వుంటుంది.

ఆ గుహలో క్షణకాలం ఓ మెరుపు మెరిసి చప్పున మాయమయింది. ఆ వెమవెంటనే తెల్లని కాంతిపుంజాల వెలుగుతో ఆ గుహ మొత్తం నిండిపోయింది.

తెల్లని వెండి లాంటి వెలుగు.

ఆ వెలుగులో, గుహలోని ప్రతి అణువూ, 'డైమండ్' లా 'ఛమక్కు... ఛమక్కు' మని మెరుస్తోంది.



ఆ తెల్లని వెలుగులో — బిగ్గరగా నవ్వుతూ, గట్టిగా అరుస్తూ ప్రత్యక్షమైనాయి దెయ్యాలు. వాటి నవ్వులకు, అరుపులకు చెట్లమీది పక్షులు ఉలికిపాటుతో నిద్రలేచి, భయంతో ఎగిరి పారిపోయాయి. కొన్ని 'షాక్'తో నేలమీద పడిపోయి ప్రాణాలను విడిచాయి. కీచురాళ్ళు అరవడం మానేశాయి. గుడ్లగూబలుభీతితో

దిక్కులు చూడసాగేయి. గబ్బిలాలు రక్తం కక్కుకుని చనిపోయాయి.

''అహహ... అహహహ...'' గుహ కూలి పోయేటట్లు, అడవి ప్రతిధ్వనించేటట్లు నవ్వ సాగేయి దెయ్యాలు.

''ఇహిహి... ఇహిహిహే హోహో...'' వింత వింత ధ్వనుల్ని సృష్టిస్తూ నృత్యం చేయసాగేయి. కొన్ని గెంతసాగేయి. మరికొన్ని కొట్టుకోసాగేయి. ఇంకొన్ని సరసాలాడు కోసాగేయి.

అప్పుడే—

ఓ సూక్ష్మజీవి ఆ దెయ్యాల ముందు ప్రత్యక్షమయింది.

ఆ జీవి పూర్తిగా జంతువులా లేదు. పూర్తిగా మనిషిలా కూడా లేదు. కనీసం అంగుళమంతయినా లేదు. 'వింత'గా వుంది. దెయ్యాలను చూస్తూ బిగ్గరగా నవ్వసాగింది.

హఠాత్తుగా ప్రత్యక్షమై బిగ్గరగా నవ్వుతున్న ఆ సూక్ష్మజీవిని చూసి దెయ్యాలన్నీ కొయ్యబారిపోయాయి.

''ఎవరు నువ్వు...?'' అడిగిందో దెయ్యం ఆ జీవిని వింతగా చూస్తూ.

''మీరెవరు...?'' తిరిగి ప్రశ్నించిందా సూక్ష్మజీవి. దాని కంఠంలోని కరుకుదనానికి దెయ్యాలు సైతం కొన్ని క్షణాలు సన్నగా వణికిపోయాయి.

''మేము ఈ విశ్వంలోని సమస్త జీవరాశుల్ని, గడగడ వణికిస్తోన్న దెయ్యాలం...!'' అంది ఓ దెయ్యం.

''ఇప్పుడు చెప్పు నువ్వెవరు...?'' అడిగింది మరో దెయ్యం.

''నేను కొ...త్త...దె...య్యా...న్ని...'' చెప్పిందా సూక్ష్మజీవి.

ఆ మాటకి ఫక్కున నవ్వాయి దెయ్యాలు.

''చూస్తే అంగుళమంతయినా లేవు. నీవు దెయ్యానివా...?

నా ఆకారం సూక్ష్మమైనా నాకు చాలా 'శక్తి సామర్థ్యాలు'' వున్నాయి'' అందా సూక్ష్మజీవి.

దాని గుండె నిబ్బరాన్ని చూసి దెయ్యాలు విస్తుబోయాయి. మహామహా శక్తివంతులే దెయ్యాల ముందు నిలబడడానికి భయపడతారు. అలాంటిది ఓ చిన్న జీవి దెయ్యాల ముందు నిలబడడమే కాకుండా, ధయిర్యంగా మాట్లాడుతుండే సరికి దెయ్యాలన్నీ విభ్రాంతికి లోనవసాగేయి.

''నీకు నిజంగా చాలా శక్తి సామర్థ్యాలు వున్నాయా...?'' అడిగిందో దెయ్యం.

అవునన్నట్లు తలూపింది ఆ సూక్ష్మజీవి.

''కూతలు కూయక మా దగ్గర నుంచి వెళ్ళిపోయి ప్రాణాలను దక్కించుకో.. వెళ్ళకపోయావో నిన్ను నంజుకుతింటాం...'' అందో దెయ్యం వికటాట్టహాసం చేస్తూ.

ఆ మాటకి సూక్ష్మజీవి మృదువుగా నవ్వింది. ''నన్ను నంజుకుతింటే మీకే 'డేంజర్'...'' అంది.

''నీకు ఇంగ్లీషు కూడా వచ్చా...?'' ఆశ్చర్యపోతూ అడిగింది మరో దెయ్యం.

''ఒక్క ఇంగ్లీషేమిటి? ప్రపంచంలోని అన్ని భాషలూ వచ్చు. విచిత్రమేమిటంటే ఒక్కో భాషలో ఒక్కో పేరుంది నాకు''

గర్వంగా చెప్పిందా సూక్ష్మజీవి.

"ఏమిటా పేర్లు...?" ఆసక్తిగా అడిగింది ఇంకో దెయ్యం.

"చెప్పను. అంతా సస్పెన్స్!..."

"అబ్బబ్బ... ఎవడివిరా నువ్వు. అనవసరంగా వాగుతూ మా మెదడ్లను తినేస్తున్నావు కదరా!..." కోపంగా అంది ఇంతకు ముందున్న దెయ్యం.

"ఎందుకలా కోపంతో చిందులేస్తావ్...? నేను కొత్త దెయ్యాన్నని ఇంతకముందే చెప్పాను కదా... అన్నట్టు మీకో బ్యాడ్ న్యూస్. ఈ ప్రపంచానికిప్పుడు మీరంటే భయం లేదు. నేనంటేనే భయం!... వణుకు!... అహహహ..." బిగ్గరగా నవ్వుతూ చెప్పిందా సూక్ష్మజీవి.

దెయ్యాలన్నీ కోపంగా చూశాయి. వాటి ముఖాలన్నీ ఎర్రబడ్డాయి.

ఓ దెయ్యం పళ్ళు కొరుకుతూ, "ఏం కూశావ్. ఈ ప్రపంచానికి మేమంటే భయం లేదా? నీవంటేనే భయమా? అతితెలివి ప్రదర్శిస్తూ మాట్లాడావంటే నిన్ను చంపేస్తాం!..." అంది.

ఆ మాటకి సూక్ష్మజీవి మళ్ళీ మృదువుగా నవ్వింది.

"నన్ను, ముట్టుకుంటేనే మీరు దారుణంగా ఛస్తారు. అలాంటిది మీరు నన్ను, చంపుతారా...?" అంది.

"మాకు చావు లేదని తెలియదా నీకు?, పిచ్చిపిచ్చిగా వాగుతున్నావ్..." అంది ఇంకో దెయ్యం, చిరాగ్గా చూస్తూ.

"తెలుసు. కానీ, నేను తలుచుకుంటే మిమ్మల్ని కూడా చం..పే..య..గ..ల..ను!.. .."

"అంత బలవంతుడివా నువ్వు...అయితే ఓసారి నాతో పోరాడు" తొడ చరుస్తూ అంది మరో దెయ్యం".

"నేను మీలాగా కండబలంతో పోరాడను. నా పోరాటం చాలా 'వెరయిటీ'గా, 'గమ్మత్తు'గా వుంటుంది. మీలాగా మనుషుల్ని అనవసరంగా చంపను. నాకు



## కాండక్ట్

'నా దగ్గర ఉద్యోగం కావాలంటే నీ కాండక్ట్ మంచిదన్న లెటర్ కావాలి ఎవరిదగ్గరయినా తీసుకు నిరా' అన్నాడు వరంధామయ్య.

'నేను మంచివాణ్ణే గనుకనే నన్ను జైల్నుంచి ఆర్నెళ్లముందు అధికారులు వదిలేసారు. అక్కడ్నుంచి తెమ్మంటారా లెటర్' అడిగాడు వుద్యోగం కోసం వచ్చిన గంగారావ్

– శ్రీకాండ
(ఎర్రబోదు)

నచ్చిన కొంతమందినే చాలా దారుణంగా హింసిస్తూ రోజుకొక్కొంచెం కొంచెం చంపుతాను. నేనిప్పుడు ఈ ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న భయంకరమైన పిశాచిని. నాకు భయపడని జీవి లేదు. వణకని ప్రాణి లేదు. నేనెవరో తెలిస్తే మీరు కూడా భయపడిపో...రి...పో...తా...రు... అహహహ...'' విరగబడి నవ్వుతూ చెప్పిందా సూక్ష్మజీవి.

''పోనీలే పాపం అని ఊర్కున్న కొద్దీ తెగ రెచ్చిపోతున్నావు. ఇక లాభం లేదు. నిన్ను ఫినిషేస్తాను'' అంటూ ఓ దెయ్యం ముందుకు కదిలింది.

సూక్ష్మజీవి ఆ దెయ్యాన్ని వారిస్తూ ''ప్లీజ్... నా దగ్గరకు రాకు. వస్తే నీకే ప్రమాదం. నువ్వు అనవసరంగా చావడం నాకిష్టం లేదు. ప్లీజ్ దగ్గరకు రాకు...'' అంది.

ఆ దెయ్యం ఎందుకో చటుక్కున ఆగిపోయింది.

''అసలు నువ్విక్కడికెందుకొచ్చావ్...?'' మరో దెయ్యం అడిగింది.

''ఈ ప్రపంచమంతా నాకు భయపడి, నన్ను కొత్తదెయ్యం కొత్తదెయ్యం అంటుందని ఇంతకు ముందే చెప్పాను కదా... 'కొత్త దెయ్యాం'గా పిలువబడుతున్న నేను దెయ్యాలుగా జీవిస్తున్న మీకు ఓసారి కనిపించి, పరిచయం చేసుకోవడం మర్యాదగా వుంటుందని వచ్చాను...''

''నీవు కొత్త దెయ్యానివంటే మాకు నమ్మబుద్ధి కావడం లేదు. పైగా ఈ ప్రపంచమంతా మాకంటే నీకే ఎక్కువగా భయపడ్తుందంటే అస్సలునమ్మకం కుదరడం లేదు. నీకు మాకన్నా ఎక్కువ శక్తి సామర్థ్యాలు వుంటే, మాకోసారి చూపించు'' అంది ఓ దెయ్యం.

''అలాగే చూపిస్తాను. నా శక్తి సామర్థ్యాలు చూసిన తరువాత మీరు నన్ను కొత్త దెయ్యంగా అంగీకరిస్తారా...?''

''నిజంగా నీకు,, మాకన్నా ఎక్కువ శక్తి సామర్థ్యాలున్నాయని తెలిస్తే మేము స్వచ్ఛందంగా అంగీకరిస్తాం!..'' అన్నాయి దెయ్యాలు.

''అయితే మీరు నాతో రండి...'' అంటూ ఆ సూక్ష్మజీవి గుహలోంచి చటుక్కున మాయమయింది. దానితోపాటే దెయ్యాలు కూడా మాయమయ్యాయి.

* * *

ప్రత్యేకంగా ఏర్పర్చిన ఓ గదిలోని బెడ్‌పై పడుకుని ఆ చేతనావస్థ స్థితిలో వున్న ఓ వ్యక్తిని దెయ్యాలకు చూపిస్తూ, ''అతడ్ని చూడండి. అతనిప్పుడు నా ఆధీనంలో వున్నాడు. నేనతడ్ని ఆవరించి రెండు నెలలు దాటింది. నేనిప్పుడు అతనిలోకి ప్రవేశిస్తాను. నా ప్రవేశం వలన అతనెంత వణికిపోతాడో కళ్ళారా చూడండి.'' అంటూ సూక్ష్మజీవి ఆ వ్యక్తిలోకి ప్రవేశించింది. ఆ జీవి ప్రవేశం వలన అతను కొన్ని క్షణాలు విద్యుత్ ఘాతం తగిలినట్లుగా కంపించిపోయాడు.

దెయ్యాలు విస్మయంతో చూడసాగేయి.

''ప్లీజ్... నన్నిలా హింసిస్తూ.. రోజూ కొద్దికొద్దిగా చంపేయకుండా ఒకేసారి

పూర్తిగా చంపెయ్యి. నేనీ అవస్థ భరించలేకుండా వున్నాను. నా గుండె అలసిపోతోంది. నా వెన్నుపూస వంగిపోతోంది. నా నరాలన్నీ తెగిపోతున్నాయి. ప్లీజ్... నన్ను తొందరగా చంపెయ్యి". విలవిల్లాడిపోతూ బాధగా అరుస్తున్నాడతను.

అతణ్ణి చూస్తున్న దెయ్యాలు నిరుత్తరులయ్యాయి.

ఓ రెండు నిమిషాల తర్వాత, అతనిలోంచి సూక్ష్మజీవి బయటకు వచ్చి, దెయ్యాలతో "చూశారా? నా ప్రవేశం వలన అతనెంత వణికి పోయాడో... అతనొక్కడే కాదు. అలాంటి వాళ్ళు ఇంకా చాలా మంది వున్నారు" అంది.

"అతనేం తప్పు చేశాడని అంత ఘోరంగా బాధిస్తున్నావ్...?" ఓ దెయ్యం విభ్రాంతికి లోనవుతూ అడిగింది.

"చాలా పెద్ద తప్పు చేశాడు. అదీ తెలిసే చేశాడు" అంది సూక్ష్మజీవి.

"ఆ తప్పేమిటో చెప్పు..." ఇంకో దెయ్యం అడిగింది.

"నన్ను ని..ద్ర..లే..ప..డం!..."

ఆ మాటకి దెయ్యాలు ఉలిక్కిపడి ముఖాలు చూసుకున్నాయి.

"కేవలం నిన్ను, నిద్ర లేపినంత మాత్రాన అతణ్ణి అంత 'ఇది'గా శిక్షించాలా...?" అందో దెయ్యం.

"శిక్షించక తప్పదు. నేను ఊర్కే నిద్ర లేవను. విచ్చలవిడిగా ప్రవర్తించే ఇలాంటి 'రోగ్స్' వల్లే నిద్రలేస్తాను".

"ఇప్పటికైనా నువ్వెవరో చెప్పు..." ఇంకో దెయ్యం అడిగింది.

"మీరు నన్ను "కొత్తదెయ్యం'గా అంగీకరిస్తున్నారా...?"

"స్వచ్ఛందంగా అంగీకరిస్తున్నాం. నువ్వెవరో తొందరగా చెప్పు..." అన్నాయి దెయ్యాలు.

"నేనెవరో చెప్పిన తరువాత మీరు భయపడి పారిపోకూడదు..."

"అలాగే. పారిపోం... తొందరగా చెప్పు..." అన్నాయి దెయ్యాలు.

"నేను 'హెచ్.ఐ.వి. వైరస్'ను..." చెప్పిందా సూక్ష్మజీవి.

అంతే దెయ్యాలన్నీ సన్నగా వణికిపోయాయి.

"అమ్మో!... నువ్వు హెచ్చయివీ వైరస్వా... అంటే 'ఎయిడ్స్ వ్యాధి క్రిమి'వా...?-" అని అరుస్తూ చటుక్కున అక్కడి నుంచి మాయమై దూరంగా పారిపోయాయి దెయ్యాలు.

దిక్కులు ప్రతిధ్వనించేటట్లు బిగ్గరగా నవ్విందా సూక్ష్మజీవి.

*

